# తీర్పు

ఎదురుగా రావి చెట్టు.

దాని చుట్టూ సిమెంటు దిమ్మ. రామాయపాలెం గ్రామానికి అదే ధర్మాసనం. రచ్చబండ పేరుతో పిలుస్తున్నా. అది సాక్షాత్తూ న్యాయపీఠమే.

న్యాయదేవత కనిపించలేదు. కానీ, నారాయణం గారు అందుకు మారుపేరే. ఆయన ఆరడుగుల ఎత్తులో అణువణువూ నిజాయతీతో నిండిపోయిందని ఊరిజనం ఘనంగా చెప్పుకొంటారు. కావటానికి మోతుబరి అయినా, ఏనాడూ బరి దాటి మాట్లాడిన పాపాన పోలా. లోతైన మనిషి. ఎక్కువ వింటాడు. తక్కువ మాట్లాడతాడు. ఆయన గంభీరత్వం మొహానికి ఠీవి చేకూరుస్తుంటుంది.

ఊరి సమస్యల మీద పంచాయితీ ఆదివారం నాడే జరుగుతుంది.

ఇవాళ ఆదివారం.

జనం అంతా అక్కడికి చేరుకున్నారు.

రచ్చబండ మీద నారాయణం గారితో పాటు కూచునే ఇద్దరూ వచ్చారు. ఒకాయన సత్తెంగారు. ఊరి పంచాయితీ ప్రెసిడెంటు. రెండో ఆయన శ్రీరాములు గారు. మాజీ సర్పంచి సర్పం లాంటివాడే. పగబడితే ఎవడ్నీ వదలడు. కోపం జాస్తి. కానీ ఆస్తిలో అనుభవంలో, వయసులో పెద్దవాడైన నారాయణం ముందు నోరెత్తడు. అలాగని ఆవేశం ఆపుకోలేదు.

అందరూ నారాయణంగారి కోసమే ఎదురుచూస్తున్నారు.

ఆయన ఇల్లు విడిచి బయల్దేరే ముందు అన్నివైపులా తేరిపారచూస్తాడు. పాలేళ్ళు ఏం చేస్తున్నారు? గొడ్డు గోద ఎలా వున్నాయి? తనకిష్టమైన పుంగనూరు ఆవు ఏం చేస్తోంది? మేత సరిగా వేశారా లేదా? నలిగిన గడ్డి, పేడకళ్ళు తీశారా లేదా.. ఆవుకు స్నానం చేయించారా లేదా...ఇవన్నీ పరిశీలించాక గానీ గేటు దాటడు.

లక్ష పెట్టి కొన్న పుంగనూరు ఆవు ఆయన్ని చూడగానే ఆప్యాయంగా పెద్దగా 'అంబా' అంటూ తల ఊపుతుంది. దాని వెన్నుతట్టి, గంగడోలు నిమిరిన తరవాత గానీ ఇంకో పనికి వెళ్ళాలనిపించదాయనకు.

రచ్చబండ దగ్గర ఎండ వేడెక్కుతోంది.

జనం ఎవరి యావలో వాళ్ళున్నారు. మధ్య మధ్య నారాయణం గారు రావాల్సిన వారి కోసం చూస్తున్నారు. ఆరోజు విచారించాల్సిన ఫిర్యాదు తాలూకు మనుషులు సిద్ధంగా ఉన్నారు.

అట్టే నిరీక్షణ అవసరం లేకుండానే నారాయణం గారు రచ్చబండ వైపు వస్తూ కనిపించాడు. అంతే. ఎక్కడ వాళ్ళక్కడ మాటలాపి, మౌనంగా నిలబడి పోయారు. ఆయన రాగానే సత్తెంగారు, శ్రీరాములు గారు లేచి నిలబడ్డారు. నారాయణం గారు తల పంకించి, ఓ మాటు అందర్నీ కలియజూసి, తన స్థానంలో కూచున్నాడు. మిగతా ఇద్దరూ కూచున్నాక-

"ఊఁ...చెప్పండి" అన్నాడు.

పాపారావు ముందుగా నోరు విప్పాడు. అభియోగం గొంతెత్తి చెప్పాడు. నిందితుడు నిరంజనం మాజీ సైనికుడు. పాపారావుకు చెందిన పోరంబోకును ఆక్రమించుకుని కూరగాయలు పండించుకుంటున్నాడు. తన పదెకరాల పోరంబోకు తనకిప్పించాల. అదీ అభ్యర్థన.

నారాయణం గారు నిరంజనం వైపు చూశాడు. అంతవరకు వినయంగా చేతులు కట్టుకు నిలబడ్డ నిరంజనం ఓ దణ్ణం పెట్టి, తన విన్నపాలు విన్నవించాడు.

పాపారావు చెబుతున్న పోరంబోకు రాళ్ళు రప్పలు, పిచ్చి మొక్కలు, పొదలతో నిండి ఉంది. దాన్ని బాగుచేసుకుని కూరలు పండించుకోనా-అనడిగితే-'దానికేం భాగ్యం... చేసుకో' అన్నాడు. ఎండనక, వాననక ఒక్కడే శ్రమపడి పొలాన్ని బాగు చేశాడు. కూర మొక్కలు పాతి, పోషణ చేస్తూ, దానిమీద వచ్చే ఆదాయంతో బతుకుతున్నాడు. బీదా బిక్కీ జనానికి ఉచితంగా కూరలు ఇస్తున్నాడు. ఇప్పుడు పొలం వెనక్కి ఇచ్చేస్తే అన్యాయమైపోతాడు. పాపారావుకి పెద్దలిచ్చిన

ఆస్తిపాస్తులున్నాయి. తనకి పూరిపాక తప్ప ఇంకో ఆస్తి లేదు. గవర్నమెంటు ఇచ్చే పెన్షన్ కుటుంబ పోషణకు చాలదు. కాబట్టి తనని పొలం ఖాళీ చేయమనకుండా చూడాలి. అదీ అతని ప్రార్థన.

నారాయణం గారు పక్కనే కూచున్న ఇద్దర్నీ సంప్రదించాడు.

కష్టపడి బాగు చేశాక నా పొలం నాకిమ్మనటం అన్యాయం. కావాలంటే కౌలు కింద కొంత పైకం ఇమ్మనొచ్చు" అన్నాడు సత్యంగారు.

"ఆడి పొలం ఆడికివ్వటానికిన్ని మతలబులు దేనికి? ఆడికిష్టం అయిందిఇచ్చాడు. ఇష్టం లేదు ఎనక్కిమ్మంటే ఇవ్వాల్సిందే గదా?" అన్నాడు శ్రీరాములు గారు.

నారాయణగారు జనం కేసి చూశాడు.

జనం ఆయనేమంటాడో వినాలనే కుతూహలంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పాపారావును చూస్తూ ప్రశ్నించాడు.

"నిరంజనం నీకు కౌలు డబ్బులిస్తాడు. పొలం అతన్ని చేసుకోనిస్తావా?"

"ఎట్టా కుదురుద్దండీ..నా పొలం నాక్కావాల్సిందే" పట్టుదలగా అన్నాడు పాపారావు.

"పొలంమీద పెట్టుబడి పెట్టాడుగా...దాని సంగతేంటి?"

"ఇన్నాళ్ళూ పండించుకు తిన్నాడుగా...అది సరిపోద్ది."

"నిరంజనం! నీ మాటేమిటి? పొలం తిరిగి ఇస్తావా?"

"తమరిమ్మని గట్టిగా చెబుతే తప్పక ఇచ్చేస్తానండీ..కానీ తమరికి తెలియాల్సిన ఇషయం ఓటుందండీ" అన్నాడు వినయంగా నిరంజనం.

"ఏంటది?"

"నేను కష్టపడి, రాళ్ళూ రప్ప, మొక్క తుప్పతీసి బాగు చేశాను. ఇప్పుడది నిఖార్సయిన పంటపొలం. ఏడాది పొడవునా కూరలు ఇస్తోంది. ఊరికి కూరల కరువు లేకుండా ఉంది. పాపారావు రోజూ కూరలు ఆ పొలంలోంచే కోసుకెళ్తుంటాడు.."

"నిజమేనా పాపారావ్?"

"అందులో అబద్ధం సెప్పటానికేవుందండీ..నిజమే"

"నువ్వు తీసుకెళ్ళే కూరలకి డబ్బులిస్తున్నావా?"

"లేదండీ"

"మరింకేం?..రోజూ బేవార్సుగా కూరలు దొబ్బుకెళ్తూ ఇప్పుడు పొలం కావాలంటావేంది?" సత్తెంగారు కలగజేసుకున్నాడు.

"దానికీ దీనికీ ఏం సంబంధమండీ...కూరల కోసం పదెకరాల పొలం వదులుకోమంటారా?"

"వదులుకోవద్దండీ...నేను అందులో కూలిపని సేత్తా నా కూలి నా కిమ్మనండి.." అన్నాడు నిరంజనం.

"ఏమంటావ్ పాపారావ్?" అడిగాడు నారాయణం గారు.

"అబ్బే కుదరదండీ...ఆ వంకతో పొలంలో కూరలు ఎత్తుకెళ్ళి అమ్ముకుంటాడండీ.."

"నేనంత నీతిమాలినవోణ్ని కాదు"

"నీ నీతి ఎవడిక్కావాలి? నా పంట నా ఇష్టం. నా పొలంలో నేను ఎవర్నో పెట్టి పన్చేయించుకుంటా..నువ్వు అడుగు పెట్టడానికి వీల్లేదు" కరాఖండీగా అన్నాడు పాపారావు.

"సరే ఇంతదాకా వచ్చాక చేసేదేముంది? పాపారావు పొలం వెనక్కి ఇచ్చెయ్" అన్నాడు శ్రీరాములు.

"అసలు యిసయం పొలం గిలం కాదు బాబూ.." అంటూ జనంలోంచి ముందుకొచ్చింది లచ్చి.

"నువ్వెవరు?" అనడిగాడు నారాయణంగారు

"నేను నిరంజనం భార్యనండి. నా పేరు లచ్చి.." అంది రెండు చేతులు జోడించి దణ్ణం పెడుతూ.

"రామాయణంలో పిడకల వేటలాగా మజ్జలో నీ గోల ఏందీ?" అన్నాడు విసుగ్గా శ్రీరాములు.

"చెప్పనీ..." అని లచ్చిని చూస్తూ "ఏం చెప్పదలచుకున్నావో చెప్పు" అన్నాడు నారాయణంగారు.

"ఈ లచ్చి పచ్చి అబద్ధాలకోరండి...దీని మాటలు నమ్మకండి..." అడ్డు తగిలాడు పాపారావు.

"విననీవో..ఇన్నాక కద నిజమో అబద్ధమో తెలిసేది. నువ్వు చెప్పు.." అన్నాడు సత్తెంగారు లచ్చిని చూస్తూ.

"ఈ పాపారావు పరమ పాపాత్ముడు బాబూ..దగుల్బాజీ ఎదవ.."

“తిట్లు ఆపి విషయం చెప్పు”

“ఈడికి ఆడ పిచ్చి ఉందండీ..అదివరలో ఆడాళ్ళ చేత తన్నులు కూడా తిన్నాడండీ”

“అయన్నీ నమ్మబోకండి. ఇది అబద్ధాల కోరు. కట్టు కథలు చెబుతోంది..”

“ఇదుగో లచ్చీ..ఇంతకీ విషయం ఏంటో చెప్పు. వీడు నీ వెంట ఎప్పుడన్నా పడ్డాడా?”

“అవును బాబూ! తనకి లొంగకపోతే పొలం లాగేసుకుంటానన్నాడండీ..అందుకే ఈ పంచాయితీ పెట్టాడు బాబూ”

“నిరంజనం..ఈ సంగతి నీకు తెలుసా?”

“తెలుసు బాబూ! బైటికి చెబితే చంపేస్తానని బెదిరించాడండీ...అందుకే నోర్మూసుకున్నానండీ..”

“మిలట్రీ వోడివి...నువ్వు చావుకి భయపడితే ఎలా?” అన్నాడు చులకనగా సత్తెంగారు.

“అంత మాటన్నారు గనుక చెబుతున్నానండీ..నేను చస్తానని కాదండీ, పాపారావు చస్తాడని బయం అండీ...”

“ఆడు చస్తే నీకు భయం దేనికి?”

“యుద్ధంలో అవతలివాణ్ని చంపుతే అది గొప్పవుతుందండీ. కొట్లాటలో ఎదుటోణ్ని చంపితే అది హత్యవుతుందండీ. అక్కడ పతకం ఇస్తారు..ఇక్కడ శిక్ష వేస్తారు. నేను జైల్లో కూచుంటే నా పెళ్ళాం పిల్లల్ని ఎవరు చూస్తారు బాబూ...అందుకే బయమండీ”

“పాపారావ్..ఆ లచ్చి నీకు లొంగలేదని పొలం వెనక్కి ఇచ్చేమంటం ఏవన్నా బాగుందా?” అడిగాడు సత్తెంగారు.

“అసలు విషయం అది కూడా కాదండీ..” అన్నాడు పాపారావు.

“మరేంటి?”

“ఇయ్యాల్టికిది వాయిదా వేయండి. వచ్చే ఆదివారం లోగా నేను, నిరంజనం రాజీ పడకపోతే మళ్ళీ పంచాయితీ పెట్టండి”

“సరే...అలాగే కానీ..” అంటూ లేచాడు నారాయణం గారు.

000

ఆదివారం రానే వచ్చింది. వారం రోజుల్లో రాజీ ప్రయత్నాల పేరుమీద

నిరంజనం తరచుగా పాపారావు ఇంటికి రోజూ వెళ్ళటం, రావటం, గంటలు గంటలు మాట్లాడుకోవటం అందరూ చూస్తూనే ఉన్నారు.

పంచాయితీ ప్రారంభమైంది.

"ఊఁ ఏమయింది? ఇద్దరూ రాజీపడ్డారా?" అడిగాడు నారాయణం గారు.

"నేను రెడీ అండీ..ఆడే ఇంటం లేదు" అన్నాడు పాపారావు.

"ఏంటి నిరంజనం? ఏంటీ సమస్య?"

"సమస్య నా ఒక్కడిదే కాదండీ. మొత్తం ఊరిదండీ"

"అదేంటి?" ఆశ్చర్యంగా అడిగాడు నారాయణం గారు.

"నాకు లక్ష రూపాయలిస్తానన్నాడండీ...ఇక పొలంలోకి అడుగుపెట్టకూడదని షరతు పెట్టాడండీ"

"ఇంకేం! హాయిగా లక్ష రూపాయలు తీసుకుని పొలం వదిలెయ్యొచ్చుగా" అన్నాడు శ్రీరాములు గారు.

"లక్ష రూపాయలు నాకిస్తానన్నాడంటే ఊరికే ఎందుకిస్తాడు? ఆ పొలం మీద వ్యభిచారం చేస్తాడట.."

"అదేంటి?" ఆశ్చర్యంగా అడిగాడు సత్యంగారు.

"గంజాయి తోట వేస్తాడట...పంటలిచ్చే పొలాన్ని గంజాయి తోటగా మార్చటం అంటే అది వ్యభిచారమే గదా!" అన్నాడు నిరంజనం.

నారాయణం గారు కోపంగా పాపారావు కేసి చూశాడు.

"నిజమేనా?" ఉరిమినట్టు ప్రశ్నించాడు.

"నిజమే గానీండి..ఆ పంట వేసుకుంటానని పట్నం నించి ఒకాయనొచ్చాడు నాది ఊరికి దూరంగా వున్న పోరంబోకు కదా! అందుకని ఎకరాకి లక్ష ఇస్తానన్నాడు. నేను సరే అనేశాను. ఇందులో తప్పేముంది? ఎవరి లాభం వాళ్ళు చూసుకుంటాం కదా?" అన్నాడు పాపారావు.

"ఓరి తెలివితక్కువ పాపారావ్! గంజాయి పంట పండిస్తే జైల్లో పడేస్తారు. ఆ సంగత్తెలవదా నీకు?" గద్దించాడు నారాయణంగారు.

"నా పొలం నా యిష్టం. నన్ను జైల్లో పడెయ్యటానికి ఆళ్ళెవరు?"

"నా పెళ్ళాం నా యిష్టం అని చెరువులోకి నెట్టావనుకో...లోకం ఊరుకుంటుందా?"

"అది వేరు, ఇది వేరు. ఇది పొలం. మనిషి కాదు."

"ఆ పొలమే మనుషులకి అన్నం పెడుతుంది. అది తెలుసుకో. నిరంజనం పనికిరాని పొలాన్ని బాగుచేసి, జనాలకి పనికొచ్చే కూరలు పండిస్తున్నాడు. నీకు, బీదోళ్ళకి కూరలు ఊరికే ఇస్తున్నాడు. అవునా? హాయిగా తినక నీకిదేం పోయేకాలంరా! గంజాయిమొక్కలు పెంచటమేమిటి? బాగుపడేవాడు తులసి మొక్కలు పెంచుతానంటాడు. నువ్వేందిరా ఎదవా.." కొరడాతో బాదినట్లు మాట్లాడాడు సత్తెంగారు.

"అలాగే కానీండి..నేను తులసి మొక్కలే పెంచుతా. గంజాయి మొక్కలు పెంచను. నా పొలం నాకిచ్చెయ్యమనండి..." మొండిగా అన్నాడు పాపారావు.

"ఏదో వంకతో పొలం లాగేసుకుందామని చూస్తున్నాడు. పాపారావు తులసి మొక్కలు ఎందుకు పెంచుతాడు సార్! గంజాయి మొక్కలే పెంచుతాడు" మొత్తుకున్నాడు నిరంజనం.

"నా పొలం నా ఇష్టం. మధ్యలోనీ గోల ఏంటి?" కసురుకున్నాడు పాపారావు.

"అరే పాపారావ్! అది పోరంబోకుది. ఏనాడో మీ తాతలు మీ పొలాల్లో కలుపుకుని మాది మాది అంటున్నారు. గట్టిగా మాట్లాడితే అది ప్రభుత్వానిది. అంటే పంచాయితీది. నా పొలం నా పొలం అని గొడవ పెట్టావనుకో..తీర్మానం చేసి పంచాయితీ ఆస్తి కింద ప్రకటిస్తాం..." అన్నాడు సత్తెంగారు.

"ఇది అన్యాయం.." అన్నాడు ఆక్రోశంగా పాపారావు.

"కాదు. న్యాయమే.." అన్నాడు నారాయణం గారు.

"తమరు కూడా.." ఆశ్చర్యంగా చూస్తుండిపోయాడు పాపారావు.

"అవును పాపారావ్! ఈ గొడవంతా చూస్తుంటే నాకు బుద్ధుడి చిన్నప్పటి కథ గుర్తొస్తోంది"

"ఏంటి నారాయణం గారూ అది!" ఆసక్తిగా అడిగాడు శ్రీరాములు.

"ఆకాశంలో ఎగురుతున్న హంసను బాణంతో కొట్టాడొక రాజకుమారుడు. అది గిలగిల తన్నుకుంటూ కిందపడిపోయి రక్తం ఓడుతోంది. అక్కడే ఉన్న సిద్ధార్థుడు అంటే బాలబుద్ధుడు ఆ హంసకు గుచ్చుకున్న బాణం జాగ్రత్తగా తీసి, దాని గాయాలకు వైద్యం చేసి రక్షించాడు. అంతలో బాణంతో హంసను కూల్చిన రాకుమారుడొచ్చి హంస తనకిమ్మని పేచీ పెట్టుకున్నాడు. సిద్ధార్థుడు ఒప్పుకోలా! ఇద్దరూ రాజుగారి దగ్గరకు వెళ్ళారు. విషయం అంతా విన్న మహారాజు హంసను సిద్ధార్థుడికి ఇచ్చాడు. చంపేవాడికన్నా రక్షించేవాడు గొప్పవాడు. అలాగే పాపారావు, బాణంతో హంసను

కొట్టినవాడితో సమం. పొలం హంసతో సమం. నిరంజనం సిద్ధార్థుడితో సమం. గంజాయితోట పెంచాలనుకునే పాపారావుకు పొలం దక్కితే ఊరి పరువు పోతుంది. గ్రామం మీద పోలీసులు దాడి చేస్తారు. అమాయకుల్ని అనుమానించవచ్చు. బాధించనూ వచ్చు. అందుకని..” అంటూ చెప్పటం ఆపి నారాయణ గారు ఓ మాటు అందరికేసీ చూశాడు.

అందరూ ఆయనకేసి చూస్తున్నారు.

“అందుకని..పోరంబోకు పొలాన్ని పంచాయితీ ఆస్తిగా ప్రకటించి, మాజీ సైనికుడైన నిరంజనానికి ఇవ్వాలని తీర్పు ఇస్తున్నాను” అని వెళ్ళటానికి లేచాడు నారాయణం గారు.

చప్పట్లతో అందరూ ఆమోదం తెలిపారు.

సత్తెంగారు “ఈ పని ఎప్పుడో చేయాల్సింది” అంటూ లేచి “రేయ్ పాపారావ్! ఊరి పొలాల్లో ఎక్కడన్నా గంజాయి మొక్క కనిపించిందంటే, నేనే పోలీసుల్ని పిలిచి నిన్ను పట్టిస్తా జాగ్రత్త” అంటూ కండువా దులుపుకొని ఇంటిదారి పట్టాడు. అందరూ వెళ్ళి పోయాక, నిరంజనం భార్య లచ్చి రచ్చబండ దగ్గరకెళ్ళి కృతజ్ఞతగా తలలు వంచి చేతులు జోడించారు.

రచ్చబండ మీదున్న అదృశ్యదేవతలు అనుగ్రహంతో ఆశీర్వదించినట్టు, రావిచెట్టు ఆనందంగా కొమ్మలు కదిలించింది. ఆకులు గలగల నవ్వాయి.

భార్య లచ్చి చెయ్యి పట్టుకుని ఉత్సాహంగా పొలం వైపు నడిచాడు నిరంజనం.

(నవ్య వీక్లీ)